ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 8 అక్టోబరు 2024



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ శివశంకర్, జేసీ అదితి సింగ్



అర్జీదారుల సమస్యలు
సత్వరం పరిష్కరించాలి

● కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 7: జిల్లా నలు మూలాల నుంచి వచ్చే అర్జీదారుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్డీఏపీడీ ఆనంద్ నాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అధికారులు వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుంటూ తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారుల క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలన్నారు. పారదర్శకంగా విచారణచేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కాగా.. ఉదయం 9-30 గంటల నుంచి 10 -30 గంటల వరకు జాయింట్ కలెక్టర్ నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి ఐదుగురు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. ఫోన్ ద్వారా అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

జమిలి ఎన్నికలు అసాధ్యం : తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 7: లోక్‌సభకు, అన్నిరాష్ట్రాల అసెంబ్లీలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు, స్థానిక ప్రభుత్వాలకు దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించాలని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాధ్యం కాదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది జరగాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాలన్నారు. రాజ్యాంగ సవరణచేయాలంటే లోక్‌సభలో, రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ ఉండాలన్నారు. లోక్‌సభ సభ్యుల మొత్తం సంఖ్య 543, మూడింట రెండువంతుల మెజారిటీ 362, ప్రస్తుతం ఎన్డీయే సభ్యుల సంఖ్య 293 అన్నారు. రాజ్యసభ సభ్యుల మొత్తం సంఖ్య 245, మూడింట రెండు వంతులు 164, ప్రస్తుతం ఎన్డీఏ బలం 121 అన్నారు. కాబట్టి జమిలి ఎన్నికలు అసాధ్యమన్నారు. ఎన్నికల ఖర్చు తగ్గించడం కోసమే జమిలి ఎన్నికలు అనడంలో అర్థం లేదన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా పేరుగాంచిన అమెరికాలో జమిలి ఎన్నికలులేవన్నారు. జమిలి ఎన్నికలు అవినీతికి, నియంతృత్వానికి దారి తీస్తాయన్నారు.

29,215 మెట్రిక్ టన్నుల ఎరువులు మంజూరు



రైల్వే వ్యాగన్ నుంచి స్టాక్ పాయింట్లకు తరలిస్తున్న ఎరువులు

కడప (రూరల్), అక్టోబర్ 7: రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. వారం రోజుల నుంచి జిల్లాలో సాగుకు అనుకూలమైన వర్షాలు పడుతున్నాయి. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ ఎరువుల కొరత లేకుండా తగు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం రబీ సీజన్‌కు గాను జిల్లాకు వివిధ రకాలకు చెందిన 29,215 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయి. ఇందులో యూరియా 6,419.67 టన్నులు, డీఏపీ 1,935.6 టన్నులు, ఎంఓపీ 2,015.44 టన్నులు, కాంప్లెక్స్ 17,042.02 టన్నులు, ఎస్ఎస్‌పి 1801.6 టన్నులు ఉన్నాయి. వీటిని వ్యవసాయ శాఖ జిల్లాలోని ఆయా రైతు సేవా కేంద్రాలకు, ప్రైవేట్ డీలర్లకు తరలించి రైతులకు అందుబాటులో ఉంచారు. అలాగే రానున్న 15 రోజుల్లో అదనంగా 8,200 టన్నుల యూరియా, 2500 టన్నుల డీఏపీ జిల్లాకు వచ్చేలా చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఏ.నాగేశ్వరరావు తెలిపారు.

మద్యం దర్‌ఖాస్తులు

● లాటరీల్లో షాపులు వచ్చినా.. ● తమకే ఇవ్వాలంటూ కూటమి నేతల వార్నింగ్?
● దరఖాస్తు చేసేందుకు జంకుతున్న వ్యాపారులు ● ఇప్పటికే 3 బార్లు లాక్కున్న వైనం
● లాటరీలో లైసెన్సు దక్కినా లాక్కుంటారనే ఆందోళన ● టీడీపీలో గతానికి భిన్నంగా ఈసారి వింత పోకడ
● కడపలో ఎవరికి షాపు వచ్చినా.. అన్నీ మనకే అంటూ ఓ బ్యాచ్ హంగామా
● సమావేశం ఏర్పాటు ● ఎవరెన్ని దరఖాస్తులు వేయాలో నిర్ణయం



ఎక్సైజ్ కార్యాలయం

వైసీపీ హయాంలో ప్రభుత్వమే మద్యంషాపులు నిర్వహించింది. వాటి ద్వారా 'జే'బ్రాండ్ అమ్మి మందుబాబుల ఆరోగ్యాన్ని గుల్లచేసింది. ఓ విధంగా చెప్పాలంటే ఏపీ లిక్కరు తాగితే ఆరోగ్యం గోవిందా అనే స్థాయికి వెళ్లిపోయింది. కూటమి అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అన్నట్లుగానే కొత్త మద్యం పాలసీకి శ్రీకారం చుట్టారు. మద్యాన్ని ప్రైవేటుకు అప్పగించనున్నారు. ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానించారు. నూతన మద్యం పాలసీ కోసం మందుబాబులే కాదు వ్యాపారులూ ఆసక్తిగా చూశారు. అయితే.. గతంలో ఎన్నడూ లేని కొత్త సంస్కృతికి ఈసారి కొందరు టీడీపీ నేతలు శ్రీకారం చుట్టారు. వీరి తీరుచూసి బ్రాంది షాపులకు దరఖాస్తు చేయాలన్నా చాలా మంది భయపడుతున్నారు. మాదే గవర్నమెంటు, షాపు వచ్చినా మాకు వాటా ఇవ్వాల్సిందే.. మా మాటే వేదం అంటూ తమదైన స్టైల్‌లో కొందరు టీడీపీ, కూటమి నేతలు బెదరిస్తుండడం తీవ్ర చర్చనీయాంశమైంది.

(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి టీడీపీలో దూకిన కొందరు నేతలు ఇప్పుడు అంతా తామై వ్యవహరిస్తున్నారు. ఆది నుంచి టీడీపీ జెండా మోసిన వారిని సైడ్ చేసేశారు. పార్టీ కష్టకాలంలో అండగా లేనివారు, నిన్నగాక మొన్న పార్టీలోకి వచ్చిన వారు కేవలం ఆయా సామాజిక వర్గాలవారమని చెప్పుకునేవాళ్లే తీరుతో ఇప్పుడు బ్రాందీ షాపులకు దరఖాస్తు చేసుకోవాలన్నా వీలుకావడం లేదని అంటున్నారు. చంద్రబాబు సర్కారు దరఖాస్తులపై భారీ ఆశలు పెట్టుకుంది. అయితే ఫస్ట్ టైం వ్యాపారులు భయపడి ముందుకు రావడం లేదంటున్నారు. దరఖాస్తుకు ఇక రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. జిల్లాలో 139 మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తోంది. కడప ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో 30 బ్రాందిషాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. అలాగే పులివెందులలో 16, ప్రొద్దుటూరు 19, మైదుకూరు 16, ముద్దనూరు 7, జమ్మలమడుగు 14, బద్వేలు 15, ఎర్రగుంట్ల 14, సిద్దవటంలో 8 షాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. 9వతేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 11న జిల్లా పరిషత్ సభా భవనంలో లాటరీ ద్వారా షాపులు కేటాయిస్తారు. 12 నుంచి ప్రైవేటు మద్యంషాపులు మొదలుకానున్నాయి. కాగా సోమవారం సాయంత్రానికి దాదాపు వెయ్యి దరఖాస్తులు వచ్చాయని సమాచారం.

బార్లు లాక్కున్న ఎఫెక్ట్

రాష్ట్రంలో జగన్ హయాం మినహాయిస్తే మిగతా ప్రభుత్వాల్లో ప్రైవేటు మద్యంపాలసీ అమలులో ఉండేది. దీంతో లాభాలు వచ్చేవి. మద్యం వ్యాపారంపై అవగాహన ఉండేవారు వచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతంలో ఎన్నడూ లేని దుష్ట సంప్రదాయానికి తెరలేపారు. కడపలో రెండు బార్లను అధికార పార్టీలో కొందరు ముఖ్యనేతలు స్వాధీనం చేసుకున్నారు. జమ్మలమడుగులో కూడా కూటమికి చెందిన ముఖ్యనేతలు ఓ బార్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇది కలకలం రేపింది. పులివెందులలో ఓ బార్‌లోకి భాగానికి వెళ్లిపోయారు. కడపలో లక్ష్మిరెడ్డి అనే వ్యక్తి లిక్కరు వ్యాపారవేత్త. ఆయనను లిక్కర్‌డాన్ అని పిలుస్తారు. ఏ ప్రభుత్వం ఉన్నా సరే ఆయన వ్యాపారానికి ఢోకా ఉండేది కాదు. అలాంటి వ్యక్తికి చెందిన రెండు బార్లను లాక్కోవడంతో ఇప్పుడు మద్యంషాపులకు దరఖాస్తు వేసేందుకు కూడా పలువురు జంకుతున్నారంటూ చర్చ నడుస్తోంది. దీంతోపాటు కడపలో కొందరు నేతల వ్యవహారం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. టీడీపీ అధికారంలో లేనప్పుడు కనిపించకుండా ఉన్నవారు, వైసీపీ భజన చేసిన వాళ్లు, కార్పొరేషన్ ఎన్నికల్లో డిపారం అమ్ముకున్నోళ్లు ఇప్పుడు ఎక్కువ పెత్తనం చేస్తున్నారని అంటున్నారు. ఎవరికి షాపులు వచ్చినా సరే మాకే కావాలంటూ వ్యాపారులకు డైరెక్టుగా ఇన్‌డైరెక్టుగా చెబుతున్నారని అంటున్నారు. దీనికి తగ్గట్లు కొన్ని బార్లు లాక్కోవడంతో లాటరీలో తమకు వచ్చినా షాపు లాక్కుంటారేమోనన్న భయం వ్యాపారుల్లో ఉందంటారు. కడప, బద్వేలు, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగులలో అధికార పార్టీ ప్రభావం బాగా ఉందంటారు. దీంతో కొత్తవాళ్లు మద్యం వ్యాపారంలోకి వచ్చేందుకు భయపడుతున్నట్లు చెబుతారు. ఇక బద్వేలులో టీడీపీ, వైసీపీ నేతలు ఒప్పందానికి వచ్చినట్లు చెబుతున్నారు. పోటీలు పడి షాపులకు దరఖాస్తు చేసేకన్నా లిమిట్‌గా అప్లై చేద్దాం.. లాటరీ తగిలితే 70, 30శాతంగా తీసుకోవాలని ఒప్పందానికి వచ్చారంటారు. ఇదే ఫార్ములాను మైదుకూరులో కూడా వైసీపీ నేతలు పెట్టారంటారు. ఇక కమలాపురం నియోజకవర్గానికి సంబంధించి సోమవారం సాయంత్రానికి చెన్నూరు షాపులకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ఇక పులివెందులలో పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

మన సిండికేట్ లేకుంటే..

ఎవరికి షాపు వచ్చినా రద్దు చేస్తాం

కడప కార్పొరేషన్‌లో 21 షాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఇది జిల్లా హెడ్‌క్వార్టర్. ఇక్కడ విక్రయాలు బాగుంటాయి. అధికార పార్టీలో ఓ వర్గంలో కీలకంగా ఉంటున్న దేవునికడప, ఎన్జీవో కాలనీ, చక్రాయపేట, వల్లూరుకు చెందిన నేతల హవా ఇప్పుడు కడపలో సాగుతోంది. ఆ బ్యాచే ఆదివారం సాయంత్రం చిన్నచౌకులోని ఓ కల్యాణమండపంలో సమావేశం నిర్వహించారు. ఇందుకు పలువురు టీడీపీ నేతలు, మద్యం వ్యాపారులు హాజరయ్యారు. ఎవరెవరు ఎన్ని దరఖాస్తులు వేస్తారు అంటూ మొత్తం వివరాలు సేకరించారు. మనమంతా సిండికేట్.. ఈ షాపులన్నీ మనకే రావాలి. మనందరం కలిసి దరఖాస్తులకు అప్లై చేద్దాం. ఎవరికి లాటరీ తగలినా అందరికీ భాగస్వామ్యం. లాభాల్లో అందరికీ వాటా. మొత్తం 21 షాపులన్నీ సిండికేట్, రోజువారి ఎంత బిజినెస్ జరిగింది. మెయింటెన్స్ ఇతరాలు పోను వచ్చిన ఆదాయాన్ని టెండరులో పెట్టిన లెక్క ఆధారంగా పంచుకుందామని మాట్లాడుకున్నట్లు చెబుతారు. మన సిండికేట్ కాదని ఎవరైనా షాపులకు దరఖాస్తు చేసినా వారికి లాటరీ తగిలినా సరే వాటిని రద్దు చేయిస్తాం, కుదరకపోతే ఆ షాపు చుట్టే మూడు నాలుగు షాపులు పెట్టి మనదాంట్లోకి తీసుకువస్తామని మాట్లాడుకున్నట్లు సమాచారం. మనం పక్క ప్రాంతాలకు పోవడంలేదు. మనం ఇక్కడే షాపులు వేసుకుంటున్నాం, మన కాడ ఎవరు షాపులు వేసినా ఒప్పుకునేదిలేదు. లాటరీలో వేరేవారికి వచ్చినా రద్దు చేయిస్తామంటూ చక్రాయపేటకు చెందిన ఓ నేత అభయమిచ్చారంటారు. ఇప్పుడు ఆ నేత హవానే నడుస్తోంది. ఈ నేతల సిండికేట్, వార్నింగ్‌తో కొత్తగా మద్యంషాపుల్లోకి వచ్చేవారు లాటరీ తగిలినా లాక్కుంటారన్న భయంతో దరఖాస్తులు వేసేందుకు వెనకడుగు వేస్తున్నారని సమాచారం. దరఖాస్తులను అడ్డుకోవడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. దీంతో అక్షింతలు పడతాయన్న భయంతో కొందరు నేతలు తమ అనుచరుల ద్వారా విరివిగా దరఖాస్తులు చేయించే ప్లాన్ వేస్తున్నారు. ముందు వేయండి, మనకు రాకుండా వేరే వారికి వచ్చినా సరే ఆ షాపు మనకే వేసుకుందామని చెబుతుండడంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఛీఛీ ఇదేంటి

ఆయన మద్యం వ్యాపారి. వైసీపీలో కీ రోల్‌గా ఉన్నారు. టీడీపీలోకి వచ్చారు. అయితే గతంలో ఎన్నడు లేని విధంగా ఈసారి మద్యం టెండర్లలో కొందరు నేతల తీరు చూసి ఆయన అవాక్కయ్యారు. ఛీఛీ ఇదేంటి.. మద్యం టెండర్లలో ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాపారంలోకి రావచ్చు. గతంలో ఎప్పుడూ ఇలాలేదు. నేను ఎప్పుడూ ఇలా చూడలేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేయడం గమనార్హం.

టీడీపీలోకి కమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్

● మరో నలుగురు కౌన్సిలర్లు కూడా
● పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 7: కమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు నలుగురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు సోమవారం కడప నగరంలోని బిల్టప్ వద్ద ఉన్న పుత్తా ఎస్టేట్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మేరీతో పాటు నలుగురు మహిళా కౌన్సిలర్లకు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై కమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు టీడీపీలో చేరారన్నారు. వైసీపీలో వారు పడ్డ ఇబ్బందులు తెలిపారన్నారు. అందరి సహకారంతో కమలాపురాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం కమలాపురం నగర పంచాయతీలో రూ.100 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు నగర పంచాయతీని గ్రామ పంచాయతీగా మార్చేందుకు కృషిచేస్తామన్నారు. కమలాపురం ఫ్లై ఓవర్ పనులకు రూ.40 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి తదితరులు

కమలాపురం నగరపంచాయతీ టీడీపీదే..!

కమలాపురం నగర పంచాయతీ టీడీపీ ఖాతాలో చేరనుంది. వైసీపీ గెలుచుకున్న కమలాపుం నగర పంచాయతీలో ముసలం పుట్టింది. చైర్‌పర్సన్‌తో సహా నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో ఒక్కసారిగా వైసీపీ కంచుకోట కుప్పకూలింది. ఇది వైఎస్ జగన్ సొంత జిల్లాలో వైసీపీకి పెద్దషాక్ అనే చెప్పవచ్చు. కమలాపురం నగరపంచాయతీలో 20 వార్డులున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ 15 సీట్లు గెలుచుకోగా, టీడీపీ 5సీట్లను గెలుచుకుంది. అయితే వైసీపీ 15 సీట్లలో ఒకరు చనిపోగా మరొకరు రాజీనామా చేశారు. దీంతో వైసీపీ బలం 13కు చేరింది. తాజాగా వైసీపీకి చెందిన చైర్‌పర్సన్ మార్పురి మేరీతో పాటు 3, 7, 11, 17వ వార్డు కౌన్సిలర్లు షేక్ నూరి, రాజేశ్వరి, యూన్సీ, నాగమణి టీడీపీలో చేరారు. దీంతో వైసీపీ సంఖ్యా బలం 8కి పడిపోయింది. టీడీపీ బలం 10కి చేరింది. కమలాపురం నగర పంచాయతీలో పాలక వర్గం ఏర్పాటు చేయాలంటే 11 మంది సభ్యుల మెజార్టీ ఉండాలి. ఎమ్మెల్యే ఓటుతో కలుపుకుంటే 11 మంది బలం ఏర్పడింది. దీంతో కమలాపురం నగర పంచాయతీ టీడీపీ వశం కానుంది.

జగన్, అవినాశ్ పులివెందులకు
అన్యాయం చేశారు

● సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వారికి చిత్తశుద్ధి లేదు
● కాలేటి వాగు పనులు 22 శాతం మాత్రమే పూర్తి
● జీఎన్ఎస్ఎస్ ఎత్తిపోతలదీ అదే పరిస్థితి
● ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

చక్రాయపేట/వేంపల్లె, అక్టోబరు 7: పులివెందుల నియోజకవర్గానికి గత సీఎం వైఎస్ జగన్‌రెడ్డి, ఎంపీ అవినాశ్ రెడ్డి అన్యాయం చేశారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడి సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వారిద్దరికీ ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. సోమవారం ఆయన చక్రాయపేట మండలంలోని కాలేటివాగు ప్రాజెక్టును సందర్శించారు. తొలుత ఎడమకాల్వను అనంతరం ప్రాజెక్టు, స్పిల్‌వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నత్తనడక జరుగుతున్నాయన్నారు. లిఫ్ట్ ద్వారా ప్రాజెక్టుకు నీరు చేర్చి ఇక్కడి నుంచి తంబళ్లపల్లె నాయునిచెరువు వరకు నీరు అందించాలని ఈ పనులు చేపట్టారన్నారు. అయితే రూ.5300కోట్లకు గాను కేవలం 22శాతం పనులు చేశారని, అదికూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన ఆర్థిక లావాదేవీల కోసమే ఈ పనులు చేపట్టారని అన్నారు. ఈ ప్రాజెక్టు పనులు 2020లో ప్రారంభించి ఇప్పటి వరకు రూ.1590కోట్లు ఖర్చుచేసి 22 శాతం పనులు మాత్రమే చేశారన్నారు. చక్రాయపేట మండలం కరువుకాటకాలకు నిలయమని, సాగునీరు, తాగునీరు అందించాలనే ఉద్దేశంతో కాలేటివాగు ద్వారా 40చెరువులకు నీటిని అందించాలనేది ఉద్దేశం అన్నారు. కాలేటి వాగులో 1.20టీఎంసీలు నిల్వ చేసి తంబళ్లపల్లె వరకు నీరు అందించాల్సి ఉందన్నారు. కానీ ఈ పథకాన్ని పూర్తి చేయకుండా జగన్‌మోహన్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి ప్రజలకు అన్యాయం చేశారన్నారు.


చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పూర్తికి చర్యలు

వేంపల్లె మండలంలోని జీఎన్ఎస్ఎస్ కాల్వ నుంచి నిర్మాణదశలో ఉన్న ఎత్తిపోతల పథకం పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి పూర్తిచేసేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. వేంపల్లె మండలంలోని కత్తలూరు, నందిపల్లె గ్రామాల వద్ద నిలిచిపోయిన జీఎన్ఎస్ఎస్ కాల్వ ఎత్తిపోతల పథకం కాల్వ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గానికి సంబంధించి ఎత్తిపోతల, కాల్వ పనుల్లో సుమారు రూ.1500కోట్లు అవసరం కాగా ఇప్పటి వరకు రూ.510కోట్ల మేర పనులు జరిగాయన్నారు. ఐదేళ్లుగా నియోజకవర్గం తాగు, సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించారన్నారు. బాధ్యత లేకుండా వ్యవహరించిన మాజీ సీఎం జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ప్రదీప్‌రెడ్డి, డీఈ ప్రసన్నదేవి, ఏఈ చైతన్యభరత్‌రెడ్డి, ఏఈ దాదాపీర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణ, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



చక్రాయపేట మండలంలోని కాలేటివాగు ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పార్వతీమాత నమోస్తుతే..




జమ్మలమడుగు అమ్మవారిశాలలో రాజరాజేశ్వరి అలంకారం



కడపలో మోహినీదేవిగా కన్యకాపరమేశ్వరి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజైన సోమవారం అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిచ్చారు. నగరంలోని అమ్మవారిశాల వీధిలో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మోహినిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు స్కంధమాత అలంకారంలో దర్శనమిచ్చారు. ఆకులవీధిలో రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దేవదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ దర్శించుకున్నారు. ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో మధ్యాహ్నం శ్రీదేవి వనవిహారినిగా, రాత్రి బిల్వవృక్ష వాసిని పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు దంపతులు అమ్మవారిని సోమవారం రాత్రి దర్శించుకున్నారు.

- ప్రొద్దుటూరు టౌన్ / కడప కల్చరల్



ప్రొద్దుటూరు అమ్మవారి శాలలో ఎస్పీ దంపతులకు జ్ఞాపికను బహూకరిస్తున్న ఆర్యవైశ్య సభ నిర్వాహకులు



విజయదుర్గాదేవి ఆలయంలో స్కందమాతగా..




పంచాయతన లలితాంబ ఆలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారం

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి: ఎస్పీ

కడప (క్రైం), అక్టోబరు7: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు జిల్లాలోని పోలీసుస్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సదరు ఫిర్యాదులను కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



WANTED

కడప నగరంలో ప్రముఖ ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ హైస్కూల్ నందు 3rd to 5th ఇంగ్లీష్ మరియు హిందీ, 6th to 9th Class I.I.T. ఫౌండేషన్ మ్యాథ్స్, 6th & 7th ఇంగ్లీష్, సోషల్, 6th to 9th Class కంప్యూటర్ సైన్స్ బోధించుటకు అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యా యులు కావలెను. లేడీవార్డెన్స్, లేడీ P.E.T. ఆయాలు, ట్యూటర్స్ కావలెను. సెల్ : 9292607689, 9849794289

Ajc-202068

యూనిట్ కార్యాలయం

9985411183
9985411189

జ్యోతిష్యం చెప్పబడును

సమ్మక్క – సారక్క పూజారి కోయదొర లక్ష్మణరాజు పేస్ రీడింగ్ (ముఖము చూచి జ్యోతిష్యం) చెప్పబడును. సంప్రదించండి: సెల్: 63696 84174

Ajc-202500

పాస్‌పోర్టు పోయినది

పెట్నికోట శ్రీనివాసమూర్తి S/o శ్రీరాములు యం. D.No.4/328, సూపర్‌బజార్‌రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్, కడపజిల్లా, నా పాస్‌పోర్ట్ పోయినది నెం. N390942 జారీచేసిన తేది02-02-1992ఎవరి కైన దొరికినచో 93936416 74కు తెలుపగలరు.

Ajc-202377

CHANGE OF NAME

I hitherto known as SHAIK FAROOQ AHAMED son of SHAIK KHADER MOHIDDIN, R/o. 67/149-18-4, 2nd Floor, SBI Colony, KADAPA, YSR Dist., A.P.-516001, have changed my name and shall hereafter be known as SHAIK MOHAMMAD FAKRUDDIN

AJT - 4362

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఖైదీల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, అక్టోబర్ 7 : పురుషులు, మహిళల కేంద్ర కారాగాలలోని మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాపక్రుద్దీన్ జైలు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని పురుషుల, మహిళల కేంద్ర కారాగాలను ఆయన సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వ పథ కాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయసహాయం రక్షణ సలహా వ్యవస్థ, పారా లీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధివిధానాలను తెలియజేశారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ

పెండ్లిమర్రి, అక్టోబరు 7: తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ జాన్‌ఎర్విన్ సోమవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ అనురాధకు సూచించారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 7 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కమిషనరు కె.రాకేశ్‌చంద్రన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్‌హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అర్జీలను పరిశీలించి క్షేత్ర స్థాయిలో సమస్యలు కాలపరిమితి ఆధారంగా పరిష్కరించాలని సూచించారు.

నాణ్యమైన టమోటాలు సరఫరా చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), అక్టోబరు 7: కడప రైతు బజారులో నాణ్యమైన టమోటాలను సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి అన్నారు. సోమవారం ప్రజావేదికలో డీఆర్వోకు వినతిపత్రం అందించారు. పుచ్చిపోయిన కుళ్లిపోయిన నాశిరకం టమోటాలు సరఫరా చేశారని అన్నారు. వీటిపై విచారణ జరిపించాలని ఆయన కోరారు.

12వ పీఆర్సీ అమలు చేయండి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 7 : 12వ పీఆర్సీని తక్షణం అమలు చేయాలని, పీఆర్సీ అమలయ్యేంత వరకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.విజయకుమార్, మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.











చెన్నూరు తహసీల్దారుగా సరస్వతి

చెన్నూరు, అక్టోబరు 7:చెన్నూరు తహసీల్దారుగా సరస్వతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఖాజీపేట మండల తహసీల్దారుగా చేస్తూ బదిలీ ఉత్తర్వుల్లో భాగంగా ఆమె చెన్నూరుకు వచ్చారు. గతంలో కూడా ఇదే కార్యాలయంలో నెల రోజుల పాటు తహసీల్దారుగా పనిచేసిన ఆమె ఆ తరువాత బదిలీపై వెళ్లారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వీరపునాయునిపల్లె ఈఓపీఆర్డీగా బాధ్యతలు

వీరపునాయునిపల్లె, అక్టోబరు 7: మండల ప్రజాపరిషత్ ఈఓపీఆర్డీఓగా ఫులిరామ్‌సింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిద్ధవటం ఈఓపీఆర్డీఓగా పనిచేస్తూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చారు.

సింహాద్రిపురం ఈఓగా వెంకటరాముడు

సింహాద్రిపురం, అక్టోబరు 7: మండల కేంద్రం, మేజర్ పంచాయతీ అయిన సింహాద్రిపురం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ)గా వెంకటరాముడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వెంకటరాముడు అంకాళమ్మగూడూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు.

మానవత్వాన్ని చాటిన కలెక్టర్

కడప(కలెక్టరేట్), అక్టోబరు7: పేదలకు తక్షణ సహాయం చేసే విషయంలో కలెక్టర్ శివశంకర్ మానవత్వాన్ని చాటు కున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నిరుపేదలకు అండగా నిలిచారు. ఆర్థికంగా సహకరిస్తానని భరోసా ఇచ్చారు.



అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు పుల్లారెడ్డి మృతదేహం

పెండ్లిమర్రి, అక్టోబరు 7: మండలంలోని యల్లటూరు రాజీవ్ నగర్‌కు చెందిన పార్ల పుల్లారెడ్డి (57) అనే రైతు సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కథనం మేరకు.. వివరాలిలా ఉన్నాయి. పార్ల పుల్లారెడ్డి అప్పుల బాధ ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న పుల్లారెడ్డిని గమనించిన బంధువులు హుటాహుటిన కడప రిమ్స్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆత్మహత్యకు కారణం అప్పుల బాధే అని ఆయన బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

మద్యం దుకాణంలో చోరీ



దుకాణంలో తొలగించిన రేకులు

పెండ్లిమర్రి, అక్టోబరు7: మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న మద్యం దుకాణంలో చోరీ జరిగింది. రూ.5.09 లక్షల నగదును దొంగలు దోచుకెళ్లారు. సోమవారం ఉదయం షాప్ తెరిచి చూడగా షాపులోని క్యాష్ కౌంటర్‌లో డబ్బు లేకపోవడంతో అనుమానం వచ్చి చూడగా పైకప్పు పైనున్న రేకులను తొలగించి దోచుకెళ్లినట్లు తెలిసింది. దీంతో అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, సూపర్‌వైజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలు మద్యం దుకాణాన్ని పరిశీలించి కేసునమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ ఫిర్యాదు

కడప (క్రైం), అక్టోబరు 7: తన తండ్రిని విచారణ పేరుతో టూటౌన్ పోలీసులు వేధిస్తున్నారని కడప శంకరాపురానికి చెందిన గంజికుంట సురేశ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం మేరకు.. శంకరాపురంలో తన తండ్రి రఘురామిరెడ్డి కిరాణా షాపు నిర్వహిస్తున్నాడన్నారు. గతంలో తినుబండారాలు సప్లై చేస్తున్న హరి అనే వ్యక్తి తన తండ్రి వద్దకు వచ్చి 90 కిలోల వక్కలు ఉన్నాయంటూ రూ.45 వేలకు అమ్మాడన్నారు. తమకు వ్యాపారం జరగకపోవడంతో తెలిసిన వ్యాపారులకు ఆ వక్కలను తక్కువ ధరకు అమ్ముకున్నామన్నారు.అయితే వేరే వ్యక్తి తమ వక్కలు పోయాయంటూ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. దీంతో పోలీసులు తమను పిలిచి డబ్బు కట్టాలంటూ వేధిస్తున్నారన్నారు. తాము వాటిని కొనుక్కున్నామని, తమకు వక్కలు అమ్మిన వ్యక్తిని విచారించాలని తన తండ్రిని వేధించవద్దని ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

'ఇసుక రీచ్‌పై మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదు'

చక్రాయపేట, అక్టోబరు 7: ఇసుక రీచ్‌పై మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని టీడీపీ మండల ఇన్‌చార్జి మహేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే నిద్రపోయావా అంటూ జడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డిని ప్రశ్నించారు. ఉచిత ఇసుకను ప్రజలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ హయాంలో ఒక్క ఎకరాకు కూడా నీరుఇవ్వలేని దుస్థితి మీదే అన్నారు. వైసీపీనాయకులు బెదిరించడం వల్లనే వేంపల్లె-రాయచోటి రోడ్డు పనులు ఆగిపోయాయన్నారు.

అరటి వైపు రైతన్న చూపు

- ఈ ప్రాంత అరటికి భలే గిరాకీ
- రోజురోజుకూ పెరుగుతున్న అరటిసాగు
- సాగుకు లక్షలు ఖర్చు అవుతున్నా వెనకాడని రైతాంగం
- చీనీ రైతులూ.. అరటి బాట

పులివెందుల ప్రాంతంలో అరటి సాగు రోజురోజుకు పెరుగుతోంది. ఈ ప్రాంతంలో పండే అరటికి మంచి గిరాకీ ఉంటోంది. ఎక్కువ కాలం నిల్వ సామర్థ్య ఉండడంతో ఇతరరాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. గత రెండు మూడుసంవత్సరాలుగా అరటి ధరలు ఊహించని విధంగా పెరుగుతుండడం కూడా రైతులు అరటి సాగువైపు మొగ్గు చూపడానికి కారణం. చీనీ రైతులు సైతం అరటి సాగుపై మక్కువ మక్కువ చూపుతుండటం విశేషం.



పులివెందుల ప్రాంతంలో సాగులో ఉన్న అరటి పంట

పులివెందుల, అక్టోబరు 7: పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె, తొండూరు, సింహాద్రిపురం తదితర మండలాల్లో అరటి విరివిగా సాగవుతోంది. ఇక్కడ దాదాపు 28వేల హెక్టార్లలో అరటి సాగులో ఉంది. అందులోను ఈ ఏడాది రైతులు నూతనంగా 2000 నుంచి 2500 ఎకరాల్లో అరటి సాగుచేశారు. పులివెందుల ప్రాంతంలో పండే అరటి మంచి ధర పలుకుతోంది. వీటికి ఎక్కువ కాలం నిల్వ ఉండే సామర్థ్యం ఉంది. దీంతో ఇవి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా ఉంటున్నాయి. ఈ కారణాలతో ఇక్కడ పెద్దఎత్తున అరటి సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. రెండుమూడేళ్లుగా రైతులే ఊహించని విధంగా అరటి ధరలు ఉంటున్నాయి. చాలాకాలంగా పులివెందుల, లింగాల, వేంపల్లె, వేముల మండలాల్లో మాత్రమే అరటి ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఈ మండలాలతో పాటు గతేడాది, ఈ ఏడాది సింహాద్రిపురం, తొండూరు మండలాల్లోనూ రైతులు పెత్త ఎత్తున అరటి సాగుచేశారు.

ఆధునిక పద్ధతులతో అరటి సాగు

పులివెందుల ప్రాంతంలో పూర్తిగా ఆధునిక, సాంకేతికత పద్ధతులతో అరటిని సాగుచేస్తున్నారు. ఇక్కడ రైతులు టిష్యూకల్చర్ మొక్కలనే నాటుతారు. అందులోను డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా నీటితో పాటు పంటకు అవసరమైన ఎరువులు సైతం డ్రిప్ ద్వారానే అందిస్తారు. పులివెందులలో ఎక్కువ భాగం చౌడునేలలు కావడంతో ఇక్కడ పండే అరటి రుచిగాను, ఎక్కువ రోజులు నిల్వ సామర్థ్యం ఉంటున్నాయి. దీంతో పంటకు ఎక్కువ డిమాండ్ ఉంది. పులివెందుల ప్రాంతంలో అరటి దిగుబడి ఉందంటే ఇతరప్రాంతాల కంటే ఈ ప్రాంతంలోనే వ్యాపారులు మకాం వేసి వ్యాపారాలు సాగిస్తారు. ఢిల్లీ, హర్యాన, ముంబై, కలకత్తా ప్రాంతాలకు చెందిన రైతులు సైతం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇక్కడే ఉండి వ్యాపారాలు సాగించడం కొన్నేళ్లుగా సాగుతోంది.

పెరుగుతున్న అరటి ధరలు

రెండు మూడు సంవత్సరాలుగా అరటి మంచి ధర పలుకుతోంది. గత ఏడాది ఎప్పుడూ కని వినీ ఎరుగని రీతిలో టన్ను రూ.28వేల నుంచి రూ.30వేలు పలకడంతో రైతులే ఆశ్చర్యపోయే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రైతుల వద్ద దిగుబడి వచ్చే సమయంలో అరటి ధరలు పతనం కావడం, సాగుకు పెట్టిన ఖర్చుకూడా రాకపోవడంతో ఇబ్బంది పడేవారు. ఒకదశలో టన్ను కేవలం రూ.3వేలు మాత్ర మే పలకడంతో అప్పట్లో రైతులు అరటిని పాడిగేదెలకు వేసేశారు. అటువంటిది రెండు మూడు సంవత్సరాలుగా వీటి రైతులకు సంతృప్తినిచ్చేస్థాయిలో ఉంటున్నాయి. దీంతో చీనీ రైతులు సైతం అరటి వైపు మళ్లుతున్నారు. గత రెండుమూడేళ్లుగా చీనీ తోటల్లో తెగుళ్ల బెడద ఎక్కువై ఎకరాలకు ఎకరాలు ఎండిపోతున్నాయి. ఇలాంటి వారంతా అరటి సాగుకు మళ్లారు. అలాగే అరటి ధరలు ఆశాజనకంగా ఉండటం చూసిన మరికొందరు రైతులు సాగుచేసేందుకు ముందుకు వస్తున్నారు.

అరటి సాగుచేయాలంటే ఎకరానికి రూ.1.20లక్షల నుంచి రూ.1.50 లక్షలు ఖర్చుఅవుతోందని రైతులు అంటున్నారు. ఎకరాకు అరటి 25 నుంచి 30 టన్నుల దిగుబడి వస్తుంది. అన్ని ఖర్చులు పోనూ ఎకరాకు ఎంత తక్కువ అనుకున్నా రూ.5లక్షలకు పైగా మిగులుతోంది. దీంతో రైతులు ఖర్చుకు వెనకాడకుండా అరటి ససాగు చేస్తున్నారు. ఏదిఏమైనా పులివెందుల ప్రాంతం అరటిసాగుకు పెట్టింది పేరుగా మారుతోంది.



మైలేజ్ ఇచ్చే వాహనం అందుబాటులోకి రావడం హర్షణీయం

● అట్టహాసంగా ఫ్రీడం మోటార్ బైకును ఆవిష్కరించిన తులసిరెడ్డి



వేంపల్లెలో బైకును ప్రారంభిస్తున్న తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 7: అతి తక్కువ ఖర్చుతో పాటు గ్యాస్, పెట్రోల్‌తో నడిచే వాహనం వేంపల్లెలో ఉన్న యువతకు అందుబాటులోకి రావడం హర్షణీయమని పీసీసీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నా రు. ఆదివారం స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న ఆయాన్ బజాజ్ షోరూంలో గ్యాస్‌తో పాటు పెట్రోల్‌తో నడిచే సీఎన్‌జీ బజాజ్ ఫ్రీడం మోటార్ బైకును తులసిరెడ్డి అట్టహాసంగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కొత్త టెక్నాలజీతో తయారైన వాహనాలను యువతకు అందుబాటులోకి తీసుకొని వచ్చేందుకు బజాజ్ షోరూం ఆథరైజ్డ్ సర్వీసింగ్ సెంటర్ ఎండీ డాక్టర్ ఇబ్రహీం తన షోరూంకు తీసుకొని రావ డం సంతోషకరమన్నారు. ప్రపంచపు మొట్టమొదటి సీఎన్‌జీకి చెందిన పెట్రోల్, గ్యాస్‌కు చెందిన 125సీసీకి చెందిన ఫ్రీడం వాహనమని అయాన్ బజాజ్ షోరూం ఆథరైజ్డ్ సర్వీసింగ్ సెంటర్ ఎండీ డాక్టర్ ఇబ్రహీం అన్నారు. రెండు లీటర్ల పెట్రోల్‌తో 130 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు అన్నారు. అలాగే సీఎన్‌జీ గ్యాస్‌ను రెండు కిలోలు నింపితే 204 కిలోమీటర్లు వరకు ప్రయాణం చేయవచ్చు అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం చేయడానికి వీలుందని చెప్పారు. మోటర్ బైకుకు మొబైల్ చార్జింగ్ సౌకర్యం కూడా ఉందని చెప్పారు. అబ్దుల్, మాజీకో ఆప్షన్ మెంబర్ బాబా ఫకృద్దీన్, పీఎస్ కరిముల్లా, వేమనాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా రఘురాం బాధ్యతల స్వీకరణ

వల్లూరు, అక్టోబరు 7:వల్లూరు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా రఘురాం సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ జయశ్రీ పుల్లంపేటకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రఘురాంకు ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుమలత, సిబ్బంది స్వాగతం పలికారు. అలాగే ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సుమలత బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ విస్తరణాధికారిగా శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓను టీడీపీ నేత నాగేశ్వర్‌రెడ్డి పార్టీ నాయకులు కలిశారు.





విజయదుర్గాదేవి ఆలయంలో చండీహోమం




విజయదుర్గా ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

కడప (కల్చరల్), అక్టోబరు 7: కడప నగర బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు స్కంధమాత అలంకారంలో దర్శనమిచ్చారు. దుర్గామాత 5వ స్వరూపం స్కంధమాత. స్కంధ భగవానుని తల్లియైనందిన దుర్గాదేవికి స్కంధమాత గా ప్రసిద్ధిచెందింది. కాగా అమ్మవారికి వేకువజామున పంచ చత్వారింశతి ప్రత్యేక కలశములతో విశేష అభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విశేష అలంకారం అనంతరం యాగశాలలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు మహాలింగార్చన పూజను ఉభయదారులచే ఆలయ అర్చకులు నిర్వహించారు. పిదప రాత్రి 8 గంటలకు ఆలయ ప్రదక్షిణ చేశారు.



రాజరాజేశ్వరి ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవిగా..



సోమసుందరేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవిగా..



బాలపోలేరమ్మ ఆలయంలో పార్వతీదేవి అలంకారం



పులివెందుల అమ్మవారిశాలలో వనవిహారిణి అలంకారంలో అమ్మవారు



'అక్రమ మైనింగ్ అవాస్తవం'

వేముల, అక్టోబరు 7: మండలంలో అక్రమ మైనింగ్‌లు జరుగుతున్నాయనడం అవాస్తవమని టీడీపీ నాయకుడు శివనాగేంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లడుతూ వేముల మండలంలో టీడీపీ నాయకులు అక్రమమైనింగ్ చేస్తున్నారని, కమీషన్లు పర్సెంటీజీలు తీసుకుంటున్నారని పత్రికల్లో రావడం బాధాకరమన్నారు.

బీటెక్ పరీక్ష ఫలితాలు విడుదల


కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 7 : వైవీయూ, ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలల బీటెక్ 2, 4 సెమిస్టరు, బీటెక్ డిప్లమా 4వ సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డిలు సోమవారం వైస్‌చాన్సలర్ చాంబరులో విడుదల చేశారు.


శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించారు

● కలెక్టర్‌కు కొత్తపల్లి, యర్రబల్లి ప్రజల ఫిర్యాదు

కడప(కలెక్టరేట్), అక్టోబరు 7: ఎస్సీ కాలనీకి సంబంధించిన శ్మశాన స్థలాన్ని సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఆక్రమించి కంచె వేశాడని, వెంటనే చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కమలాపురం మండం పొడదుర్తి గ్రామ పంచాయతీ కొత్తపల్లివాసులు కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు సోమవారం ప్రజా పిర్యాదుల వేదికలో ఆ గ్రామ ఎస్సీలతో పాటు గ్రామపెద్దలు రాజకీయాలకు అతీతంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శ్మశాన స్థలాన్ని కూడా కబ్జా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. సుబ్బారెడ్డి అనే వ్యక్తికి అదే గ్రామంలో 1.5 ఎకడీకేటీ భూమి ఉందన్నారు. అయితే తన భూమికి చుట్టుపక్కల ఉన్న గ్రామ కంఠాల భూములు, ఎస్సీ కాలనీకి చెందిన శ్మశానవాటిక స్థలా న్ని వదలకుండా దాదాపు 10 ఎకరాల వరకు ఆక్రమించాడన్నారు. అంతే కాకుండా దౌర్జన్యంగా కంచె వేశాడని చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో స్థానికులు యల్లారెడ్డి, ఓబుల రెడ్డి, చిన్న నరసింహులు, దానమయ్య తదితరులు ఉన్నారు.







'ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం దుర్మార్గం'



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్లు చినబాబు, చైతన్య తదితరులు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 7 : కడప ఎమ్మెల్యే మాధవీపై కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ఆరోపనలు చేయడం దుర్మార్గమని, ఆమెకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలా చేస్తున్నారని మాజీ కార్పొరేటర్లు చినబాబు, చైతన్య తెలిపారు. సోమవారం కడప నగరం చిన్నచౌకు టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయక ముందు నుంచే ప్రతి డివిజనులో సమస్యలు తెలుసుకుని పరిష్కరించారన్నారు. అయితే కడపలో ప్రతిపక్ష పార్టీలు కొన్ని మీడియా సంస్థలను పక్కనబెట్టుకుని తప్పుడు కథనాలు రాయిస్తూ ఆధారాలు లేని వార్తలు ప్రసారం చేయిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు సురేశ్‌రెడ్డి, గంగరాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు ఎంపీడీవోగా మల్లీశ్వరి



బద్వేలు రూరల్, అక్టోబరు 7 : బద్వేలు ఎంపీడీవోగా దుంపల మల్లీశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె వీరబల్లి నుంచి బదిలీపై బద్వేలుకు వచ్చారు. మం డల పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులతో కలిసి కృషి చేస్తామని ఆమె తెలిపారు.

పోరుమామిళ్ల... ఆర్.రమణారెడ్డి



పోరుమామిళ్ల, అక్టోబరు 7 : పోరుమామిళ్ల ఎంపీడీవోగా ఆర్.రమణారెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేస్తున్న వర ప్రసాదరావు కర్నూలు జిల్లాకుబదిలీ కావడంతో మైదుకూరు మండలంలో పంచాయతీరాజ్ విస్తరణాధికారి పనిచేస్తున్న రమణారెడ్డి బదిలీపై సోమవారం పోరుమామిళ్ల మండలానికి వచ్చారు. ఆయనకు ఎంపీడీవో పూర్తిస్థాయి అదనపు ఆబాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనను సన్మానించారు.

ముద్దనూరు తహసీల్దారుగా వరదకిశోర్



ముద్దనూరు అక్టోబరు7: తహసీల్దారుగా సోమవారం వరదకిశోర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఈయన ముద్దనూరులోనే ఎన్‌ఫోర్సుమెంట్ డీటీగా బాధ్యతలు నిర్వహించేవారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. వరదకిశోర్‌రెడ్డికి టీడీపీ, బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువ, పూల మాలలతో సన్మానం చేశారు.

మైలవరం డీటీగా మల్లికార్జున



మైలవరం, అక్టోబరు 7: మైలవరం డిప్యూటీ తహసీల్దారుగా ఆర్. మల్లికార్జున సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మైలవరం డీటీగా ఉన్న రూపేష్ జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ కాగా పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మల్లికార్జున బదిలీపై వచ్చారు. మైలవరం ఆర్ఐగా దుర్గాదేవితో పాటు మండలంలో మరో ఆరు గురు వీఆర్వోలు పదవీ బాధ్యతలు చేపట్టారు. తొర్రివేముల వీఆర్వోగా షేక్ పక్కీర్‌సాహెబ్, ఎం.కంబాలదిన్నెకు నాగరాజు, దొడియం సుబ్బరాయుడు, వేపరాల 1. 2 శివరామయ్య, కొండన్న, దొమ్మరనంద్యాలకు రాముడు వీఆర్వోలుగా బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దారు లక్ష్మీనారాయణ తెలిపారు.

కాశినాయన ఆర్ఐగా ఆర్.అమర్‌నాథ్‌రెడ్డి

కాశినాయన అక్టోబరు7: కాశినాయన మండల ఆర్ఐగా ఆర్.అమర్‌నాథ్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ దక్షిణామూర్తి కడపకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలోకి గోపవరం మండలంలో పనిచేస్తున్న అమర్‌నాథ్‌రెడ్డి బదిలీపైవచ్చారు. ఆమేరకు సోమవారం నర్సాపురంలోని తహసీల్దారు కార్యాలయంలో విధుల్లో చేరారు.

అన్నపూర్ణేశ్వరీ... పాహిమాం



ప్రొద్దుటూరు... అమ్మవారిశాల, చెన్నకేశవస్వామి ఆలయం, గౌరమ్మకట్టవీధిలో వనవిహారినిగా అమ్మవారు, బద్వేలులో అన్నపూర్ణదేవిగా అమ్మవారు

బద్వేలుటౌన్, అక్టోబరు 7 : దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మహాలక్ష్మీదేవి ఆలయంలో తోటోత్సవం నిర్వహించారు. తోటోత్సవంలో ధాన్యలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామస్వామి ఆలయంలో సరస్వతీ దేవి అలంకారం, వీరభద్రస్వామి దేవాలయం, కనకదురా దేవి ఆలయంలో అమ్మవార దర్శనమిచ్చారు.

ముద్దనూరు..: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సోమవారం అమ్మవారు అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు.భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మైదుకూరు రూరల్..: మైదుకూరు అమ్మవారిశాలలో సోమవారం అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు విరివిగా పాల్గొన్నారు.

కాశినాయన..: నర్సాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో అమ్మవారు పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఆర్యవైశ్య వీధిలో కొత్తగా నిర్మించిన శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పోరుమామిళ్ల..: దసరా ఉత్సవాల్లో భాగంగా పోరుమామిళ్లలోని అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి వనవిహారిణి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

ఖాజీపేట..: కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు మధ్యాహ్నం పార్వతీదేవి వనవిహారిణిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా రాత్రి అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

జమ్మలమడుగు..: దసరా సందర్భంగా జమ్మలమడుగు పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని నాగులకట్ట చౌడేశ్వరీదేవి, కన్నెలూరులోని చౌడేశ్వరీదేవి ఆలయం, గంగమ్మ ఆలయం, పట్టణంలోని అంబాభవానీదేవాలయం, ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, తదితర ఆలయాల్లో భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రొద్దుటూరు పట్టణంలోని అమ్మవారిశాలలో శ్రీదేవి వనవిహారినిగా దర్శనమిచ్చిన అమ్మవారు రాత్రి బిల్వవృక్ష వాసిని పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నకేశవస్వామి ఆలయంలో మోహిని వనవిహారిణి,రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అలంకారం, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి వనవిహారిణిగా, గౌరమ్మ కట్టలో వనహారిణి పార్వతీదేవిగా భక్తులను కటాక్షించారు.

కొండాపురం..: మండలంలో దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని అమ్మవారిశాలలో ఐదో రోజు సోమవారం వనవిహారిణి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. దేవి నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎర్రగుంట్ల..: అమ్మవారిశాలలో దసరాఉత్సవాల్లో భాగంగా వనవిహారిణి అవతారంలో వాసవాంబ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీఏరువాకగంగమ్మ అమ్మవారు సోమవారం పార్వతీదేవీ అలంకారంలో భక్తులను ఆశీర్వదించారు. అలాగే శ్రీచౌడేశ్వరీదేవికి అన్నపూర్ణాదేవి అలంకారం చేశారు. దసరా ఉత్సవాల్లో ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు.



ముద్దనూరు, మైదుకూరు,ఖాజీపేటలో అన్నపూర్ణదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు, కాశినాయన..పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎర్రగుంట్ల అక్టోబరు7:ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో ఏపీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్)అశోక్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. సోమవారం ఆర్టీపీపీని అశోక్‌కుమార్‌రెడ్డిని సందర్శించగా యూనియన్ నాయకులు కలిసి సమస్యలను తెలియజేశారు. ఆర్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఐటీఐ, డిగ్రీ, డిప్లమో విద్యార్హతలు ఉన్నాయన్నారు.10నుంచి20 ఏళ్లుగా పనిచేస్తున్నా గ్రేడ్ మార్పు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీపీపీ రీజనల్ యూనియన్‌అధ్యక్షుడు గంగయ్య ,కార్యదర్శి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి కేంద్రం ప్రారంభం



వాటర్‌ప్లాంటుకు పూజలు చేస్తున్న విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 7 : మండల కేంద్రంలోని బలిజ, కాపు, తెలగ అన్నదాన సంఘంలో జల ప్రసాద కేంద్రాన్ని (తాగునీటి) పీఠాధిపతి విరజానందస్వామి సోమవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. అధ్యక్షుడు గోశెట్టి పిల్లనారాయణగారి శ్రీరాములు, కార్యదర్శి బొల్లు సిద్దయ్య, ఉధ్యక్షులు ఆవుల బాలరోశయ్య, జీటీ ఓబులేసు, బొల్లు రామ్మోహన్, కోశాధికారి ఆకుల కొండయ్య మొదటగారిబ్బను కట్ చేశారు. అనంతరం పీఠాధిపతి విరజానందస్వామి మంచినీటి కేంద్రాన్ని స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈకార్యక్రమంలో ఎస్.రమణ, వెంకటసుబ్బయ్య ఏపీజేఏసీ కార్యదర్శి అల్లం రంగనాయకులు, భైరవ ప్రసాద్, రచయిత బొల్లు రామ్మోహన్, ఆవుల బాలరోశయ్య, ఓబులేసు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టపాసుల గోడౌన్లు సీజ్

ప్రొద్దుటూరు, అక్టోబరు 7: ప్రొద్దుటూరు మండలం పొట్టిపాటిరోడ్డులోని రెండు టపాసుల గోడౌన్లను సోమవారం రాత్రి రూరల్ పోలీసులు సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా దిగుమతి చేసుకుని కొందరు వ్యాపారులు ప్రైవేట్ గోడౌన్లలో నిల్వ ఉంచుకున్నట్లు రాబడిన సమాచారం మేరకు రెండు గోడౌన్లలో 6లక్షల విలువ చేసే టపాసులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో వేణు, సత్యనారాయణ అనే వ్యక్తులు అక్రమంగా టపాసులను నిల్వ ఉంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రామలింగచౌడేశ్వరి అమ్మవారికి బంగారు కళ్లు వితరణ



బంగారు కళ్లు అందజేస్తున్న అంపావతిన నాగరాజు, విజయలక్ష్మి దంపతులు

ప్రొద్దుటూరు అక్టోబరు 7 : ప్రొద్దుటూరు పట్టణం మేదరవీధిలో కొలువైవున్న శ్రీరామలింగ చౌడేశ్వరి అమ్మవారికి భక్తులు అంపావతిన నాగరాజు, విజయలక్ష్మీ దంపతులు బంగారు కళ్లు బహూకరించారు. ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉట్టి నాయశయనకు 26 గ్రాముల బరువుగల 1.55 లక్షల విలువ గల బంగారు కళ్లను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మెన్, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఉట్టిలక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు రామచంద్రుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఇచ్చేవరకు పోరాడుతాం

బద్వేలు, అక్టోబరు 7: బద్వేలు రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రతి మండలంలో గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలు, దళితులకు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి, మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఇమ్మానుయేల్, షావలి, వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు పెంచలయ్య, మునిరత్నం, గోపవరం మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాష, నాయకులు హరి, దాసు , వెంకటేష్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బద్వేలుటౌన్, అక్టోబరు 7 : పట్టణంలోని మహమ్మద్‌కాలనీలోని ఫారెస్ట్ కార్యాలయం వెనుకవైపు మంగతాయి జూదం ఆడుతున్న ఏడుగురిని సోమవారం అరెస్టుచేసినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు తన సిబ్బందితో మున్సిపాలిటీ పరిధిలోని ఫారెస్ట్ కార్యాలయం వెనుకవైపు కంపచెట్లలో మంగతాయి ఆడుతున్న వారిపై దాడిచేసి వారి వద్ద నుంచి రూ.32,600 నగదుతోపాటు 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

మెగా జాబ్‌మేళాకు అపూర్వ స్పందన



జమ్మలమడుగు, అక్టోబరు 7: జమ్మలమడుగు- ముద్దనూరు రోడ్డులోని రిపబ్లిక్ క్లబ్ ఆవరణలో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి తదితరులు ప్రారంభించి పర్యవేక్షించారు. మెగా జాబ్‌మేళాలో 70 కంపెనీలు వచ్చాయి. సుమారు 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అన్నారు. తమ ట్రస్టు తరుపున జాబ్‌మేళా నిర్వహించి నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కొంకుల రాంబాబును సత్కరించిన మున్సిపల్ కమిషనర్



బద్వేలు, అక్టోబరు 7 : బద్వేలు పట్టణానికి చెందిన టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కొంకుల రాంబాబుకు మనం ఫౌండేషన్ వారు ట్రాన్స్‌ఫర్మేషన్ లీడర్ షిప్‌లో డాక్టరేట్ డిగ్రీ అందజేసినందుకు గాను సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, పలువురు ఆయనను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో కొంకుల రవి, మనోజ్, మోహన్, కొండారెడ్డి పాల్గొన్నారు.

బంగారు వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 7 : బంగారు వ్యాపారులు తమ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన పోలీసుస్టేషన్‌లో బంగారు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ బంగారం అమ్మేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

కమిషనర్‌గా మల్లికార్జున బాధ్యతల స్వీకరణ



ప్రొద్దుటూరు, అక్టోబరు 7: ప్రొద్దుటూరు మునిసిపల్ కమిషనర్‌గా వి.మల్లికార్జున సోమవారం రాత్రి మునిసిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఎన్నికల ముందు నెల పాటు ఇక్కడ పనిచేశారు. ప్రొద్దుటూరు పట్టణ పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తానని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 7: విద్యార్థులు లక్ష్యాన్ని సాధించి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో తీసుకునే నిర్ణయాలు కీలకమైనవని, ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడుతాయన్నారు. అనంతరం విద్యలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహమ్మద్‌ముస్తఫా, వైస్‌ప్రిన్సిపాల్ శారద, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామమోహన్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే అన్నక్యాంటీన్



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎర్రగుంట్ల అక్టోబరు7: పేదల కోసమే అన్న క్యాంటీన్ అని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఎర్రగుంట్ల ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను ఎన్డీయే ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు మూడు పూట్ల అన్నం పెట్టాలన్న ధ్యేయంతో అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అవసరమైతే ఎర్రగుంట్లలో మరో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, మండల ఇన్‌చార్జి మధుసూదనరెడ్డి,బీజేపీ ఇన్‌చార్జి జగన్మోహనరెడ్డి, కమిషనర్ శేషఫణి, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కృష్ణమ్మ ఒడిలో చదువుల తల్లి ఆలయం

కొండాపురం, అక్టోబరు 7: కృష్ణమ్మ ఒడిలో చదువులతల్లి సేదతీరుతోంది. గండికోట బ్యాక్‌వాటర్‌లో చదువులమ్మ ఆలయం ముంపునకు గురైనా కృష్ణాజలాల్లో పూజలందుకుంటోంది. వివరాల్లోకి వెళితే... పవిత్ర చిత్రావతి నదీ తీరాన కొండాపురం సమీపంలో వెలసిన సరస్వతీదేవి ఆలయం చుట్టూ ప్రస్తుతం గండికోట బ్యాక్ వాటర్ చేరింది. గుడిచుట్టూ బ్యాక్‌వాటర్ చేరడంతో చుట్టూ మట్టికట్టలు వేసి నీటిలో ఆలయం మునిగిపోకుండా మాజీ సర్పంచ్ పి.విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలోకి చేరుతున్న నీటిని మోటార్లతో డీవాటరింగ్ చేస్తున్నారు. కొండాపురం పట్టణానికి చెందిన దివంగత మాజీ ఎమ్మెల్యే సీఎం రామనాథరెడ్డి దంపతులు పవిత్ర చిత్రావతి నదీతీరాన పూజ్య గురువులు నిర్విశయానంద స్వామి ప్రేరణతో ఈ ఆలయం నిర్మించారు. అలారారే ప్రకృతిలో పాలరాతి విగ్రహంతో నిర్మించిన సరస్వతీదేవి అమ్మవారి విగ్రహం చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. దేవి నవరాత్రుల్లో వచ్చే మూలనక్షత్రం, మాఘమాసంలో వచ్చే వసంత పంచమి లు అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేస్తారు. బుధవారం మూలనక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అక్షరాభ్యాసానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.





గండికోట బ్యాక్‌వాటర్ గుడిలోకి చేరకుండా చుట్టూ మట్టికట్టతో అడ్డువేసిన దృశ్యం, పాలరాతి విగ్రహంతో భక్తులను ఆకట్టుకుంటున్న సరస్వతీదేవి అమ్మవారు



ఖైదీల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, అక్టోబర్ 7 : పురుషులు, మహిళల కేంద్ర కారాగాలలోని మానసిక వ్యాధిగ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ జైలు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని పురుషుల, మహిళల కేంద్ర కారాగాలను ఆయన సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వ పథ కాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయసహాయం రక్షణ సలహా వ్యవస్థ, పారా లీగల్ వలంటీర్లు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధివిధానాలను తెలియజేశారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ

పెండ్లిమర్రి, అక్టోబరు 7: తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ జాన్ఎర్విన్ సోమవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ అనురాధకు సూచించారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 7 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఇన్‌చార్జ్ కమిషనరు కె.రాకేశ్‌చంద్రన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్‌హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అర్జీలను పరిశీలించి క్షేత్ర స్థాయిలో సమస్యలు కాలపరిమితి ఆధారంగా పరిష్కరించాలని సూచించారు.

నాణ్యమైన టమోటాలు సరఫరా చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), అక్టోబరు 7: కడప రైతు బజారులో నాణ్యమైన టమోటాలను సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి అన్నారు. సోమవారం ప్రజావేదికలో డీఆర్వోకు వినతిపత్రం అందించారు. పుచ్చిపోయిన కుళ్లిపోయిన నాశిరకం టమోటాలు సరఫరా చేశారని అన్నారు. వీటిపై విచారణ జరిపించాలని ఆయన కోరారు.

12వ పీఆర్సీ అమలు చేయండి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 7 : 12వ పీఆర్సీని తక్షణం అమలు చేయాలని, పీఆర్సీ అమలయ్యేంత వరకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.విజయకుమార్, మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.











చెన్నూరు తహసీల్దారుగా సరస్వతి

చెన్నూరు, అక్టోబరు 7:చెన్నూరు తహసీల్దారుగా సరస్వతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఖాజీపేట మండల తహసీల్దారుగా చేస్తూ బదిలీ ఉత్తర్వుల్లో భాగంగా ఆమె చెన్నూరుకు వచ్చారు. గతంలో కూడా ఇదే కార్యాలయంలో నెల రోజుల పాటు తహసీల్దారుగా పనిచేసిన ఆమె ఆ తరువాత బదిలీపై వెళ్లారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వీరపునాయునిపల్లె ఈఓపీఆర్డీగా బాధ్యతలు

వీరపునాయునిపల్లె, అక్టోబరు 7: మండల ప్రజాపరిషత్ ఈఓపీఆర్డీఓగా పులిరామ్‌సింగ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిద్దవటం ఈఓపీఆర్డీఓగా పనిచేస్తూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఇక్కడకు వచ్చారు.

సింహాద్రిపురం ఈఓగా వెంకటరాముడు

సింహాద్రిపురం, అక్టోబరు 7: మండల కేంద్రం, మేజర్ పంచాయతీ అయిన సింహాద్రిపురం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ)గా వెంకటరాముడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో వెంకటరాముడు అంకాళమ్మగూడూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు.

మానవత్వాన్ని చాటిన కలెక్టర్

కడప(కలెక్టరేట్), అక్టోబరు7: పేదలకు తక్షణ సహాయం చేసే విషయంలో కలెక్టర్ శివశంకర్ మానవత్వాన్ని చాటు కున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల సరిష్కార వేదికలో నిరుపేదలకు అండగా నిలిచారు. ఆర్థికంగా సహకరిస్తానని భరోసా ఇచ్చారు.

